క్లుప్తంగా

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం



యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాపోటీలను ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో జరిగే కబడ్డీ, వాలీబాల్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని 16 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.చంద్రశేఖర్, బి.భీముడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పరిధిలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చేతులమీదుగా షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈవో రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగనాపురం 11 కేవీ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా గౌరీపురం, చింతలబెలగాం, పెదకుదమ, సింగనాపురం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించిసహకరించాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ధ్వంసమైన కారు ముందుభాగం

సీతంపేట: మండలంలోని దేవనాపురం వద్ద త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం పొల్ల గ్రామం నుంచి తహసీల్దారు డి.శ్రీకన్య కారులో వస్తుండగా ఓ ద్విచక్ర వాహనదారుడు బలంగా కారు ను ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ద్విచక్ర వాహనం కూడా బాగా దెబ్బతింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తెలిపారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

భామిని: నందెన్న సంబరాల్లో భాగంగా మండలంలోని కొరమ గ్రామంలో గంగాగౌరీ సమేత నందీశ్వరునికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు భగవంతుడిని వేడుకున్నారు.

భామిని మోడల్ స్కూల్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు



అవార్డు చూపిస్తున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

భామిని: స్థానిక మోడల్ స్కూల్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు లభించింది. పరిసరాల పరిశుభ్రతలో మెరుగైన ఫలితాలు సాధించినందుకు గాను ఈ గౌరవం దక్కినట్లు ప్రిన్సిపాల్ బాబూరావు తెలిపారు. ఇదే ఉత్సాహంతో మరింత శుభ్రంగా పాఠశాల ఉండేలా చూస్తామన్నారు.

పడకేసిన పల్లె వైద్యం



- సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు
- వారం రోజులుగా నిలిచిన వైద్యసేవలు
- ఓపీ, అత్యవసర సేవలూ అందని దుస్థితి
- తీవ్ర అవస్థలు పడుతున్న పల్లె ప్రజలు



వైద్య సిబ్బంది లేక బోసిపోయిన అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పాలకొండ రూరల్:

నియోజకవర్గ వ్యాప్తంగా పల్లె వైద్యం పడకేసింది. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండే వైద్యులు సమ్మెబాట పట్టడంతో ప్రజలకు వైద్యసేవలు దూరమయ్యాయి. తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల నెరవేర్చడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వైద్యులు సమ్మెకు దిగుతూ విధులకు హాజరు కావడం లేదు. దీంతో వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రులకు వచ్చే గ్రామీణులను నిరాశతో వెనుదిరుగుతున్నారు. కనీసం ఓపీ, అత్యవసర సేవలు కూడా లేకపోవడంతో చాలామంది నిరుపేదలు ప్రభుత్వం వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. అప్పులు చేసి మరీ ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని చెబుతున్నా అవి క్షేత్ర స్థాయిలో అంతగా లేవన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సెప్టెంబరు 28 నుంచి..

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా సెప్టెంబరు 28వ తేదీ నుంచి పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) వైద్యులు నిరసన బాటపట్టారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి పీహెచ్‌సీ విధులకు దూరమై చలో విజయవాడ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇప్పటికి వారం రోజులు కావడంతో పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. వైద్య సేవల కోసం వచ్చే రోగులు కూడా వైద్యులు లేరని తెలుసుకుని వచ్చిన దారినే వెళ్లిపోతున్నారు.

ఇవీ వారి డిమాండ్లు..

వైద్యుల డిమాండ్లలో ప్రధానంగా జీవో నంబరు 85, ఇన్ సర్వీస్ కోటా పునరుద్ధరణ, టైమ్ బాండ్ పదోన్నతులు అమలు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం, ట్రైబల్ అలవెన్సులు, నోషనల్ ఇంక్రిమెంట్లు అమలు వంటివి ఉన్నాయి. అలాగే చంద్రన్న సంచార చికిత్స సంబంధించి రూ.5 వేల అలవెన్స్‌తో పాటు నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. వీటితో పాటు కచ్చితమైన పని గంటలు, వారాంతపు సెలవులు, జాబ్‌చార్ట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడుగుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో గొప్పగా..

వైఎస్సార్‌సీపీ హయాంలో పల్లె జనానికి చాలా గొప్పగా వైద్యసేవలు అందేవి. నాడు-నేడు పథకం పేరిట పీహెచ్‌సీలను అభివృద్ధి చేసి, ఏరియా ఆస్పత్రిలో ఏ విధంగా అయితే వైద్యసేవలు అందుతాయో ఆ విధంగా తయారు చేశారు. అలాగే ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ వెల్ నెస్ సెంటర్ నిర్మించారు. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను నియమించి, పేదలకు ప్రభుత్వం వైద్యం దగ్గర చేశారు. ఇప్పుడు అవన్నీ నిర్లక్ష్యం కావడంతో ప్రజలు వైద్యానికి దూరమయ్యారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

రోజుకు 100 ఓపీలు..

అసలే వర్షాకాలం..సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం.. ఈ సమయంలో వైద్యులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రోగులు అధికమవుతున్నారు. పాలకొండ మండలంలోని 32 పంచాయతీల ప్రజలకు ఎం.సింగుపురం, అన్నవరం పీహెచ్‌సీలు, సీతంపేట మండలంలోని 53 పంచాయతీల్లోని గిరిజన ప్రజలకు కుశిమి, మర్రిపాడు, దోనుబాయి పీహెచ్‌సీలు, వీరఘట్టం మండలంలోని 34 పంచాయతీల ప్రజలకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సహా బిటివాడ పీహెచ్‌సీ, భామిని మండలంలోని 27 పంచాయతీల ప్రజలకు భామిని, బాలేరు పీహెచ్‌సీలతో పాటు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని బత్తిలి పీహెచ్‌సీ ఆధారం. రోజుకు సగటున 100 ఓపీలు వరకు వస్తాయని, ప్రస్తుతం రెగ్యులర్ వైద్యులు ఆస్పత్రుల్లో అందుబాటులో లేకపోవడంతో వైద్యం కష్టమవుతోందని డిప్యుటేషన్‌పై వస్తున్న వైద్యులు చెబుతున్నారు.

నిలిచిన 104 వాహన సేవలు..

షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించాల్సిన 104 వాహన సేవలు సైతం వైద్యులు లేకపోవడంతో నిలిచిపోయాయి. ప్రస్తుతం ఏ గ్రామానికీ 104 వాహనం వెళ్లకపోవడంతో పీహెచ్‌సీల వద్దనే వాహనాలు ఉంటున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులు, గర్భిణులు, బాలింతలు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.

వైద్యసేవలు అందేలా చూడాలి..

మా పంచాయతీ కేంద్రంలోని పీహెచ్‌సీపై దాదాపు 20కు పైగా గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఆధారపడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడి మైదాన ప్రాంతాల్లోని గిరిజనులకు ఈ పీహెచ్‌సీయే పెద్దదిక్కు. వారం రోజులుగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో 10 కిలోమీటర్ల దూరంలోని పాలకొండ ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. 104 వాహన సేవలు కూడా ఆగిపోయాయి. వైద్యులు తక్షణమే విధుల్లోకి వచ్చేలా ప్రభుత్వం చొరవతీసుకోవాలి.

\- ఆర్.రమాదేవి, ఎం.సింగుపురం సర్పంచ్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై పోరుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి తదితరులు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ: ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పోరుకు సిద్ధం కావాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని పాలవలస రాజశేఖరం నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు వైద్య విద్యను దగ్గర చేయాలన్న సదుద్దేశంతో ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మాత్రం ఆ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించాలని చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలనే కుట్ర అని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లాలో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని, నియోజకవర్గ కేంద్రం నుంచి వాహనాల ద్వారా అనకాపల్లికి చేరుకుని జగనన్నకు మద్దతుగా నిలవాలని, పేద విద్యార్థులకు ప్రభుత్వ వైద్య విద్య అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు దమలపాటి వెంకటరమణనాయుడు, కనపాక సూర్యప్రకాశరావు, వెలమల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు



గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెంటల్ హెల్త్ కౌన్సిలర్ శారద

జియ్యమ్మవలస రూరల్: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దని, ఆ దిశగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రేవళ్ల అనంతరావు అన్నారు. మండలంలోని చినమేరంగి కేజీబీవీ, జెడ్పీహెచ్, బీజేపురం జెడ్పీహెచ్ పాఠశాలల్లోని విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులంతా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం పెంచుకోవాలన్నారు. మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే ఎలాంటి ఒత్తిడినైనా జయించగలమని ఆయన తెలిపారు. అనంతరం మానసిక ఆరోగ్యం పెంపొందించే పలు సూచనలు చేసి, కొన్ని ఆసనాలు వేయించారు.

గుమ్మలక్ష్మీపురం: ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి మానసికంగా దృఢంగా ఉండాలని జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ కె.శారద తెలిపారు.

వసతిగృహం సందర్శించిన ఫుడ్ కమిషన్ చైర్మన్



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహం విద్యార్థుల కోసం వండిపెట్టిన ఆహారం రుచి చూస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి

పాలకొండ రూరల్: స్థానిక ఇందిరానగర్ కాలనీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహం సహా అక్కడే ఉన్న సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతిగృహాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండిపెట్టాలని, వారి ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి కొండాపురం వెళ్లిన ఆయన.. రేషన్ డిపోను సందర్శించి అక్కడి స్టాక్‌ను పరిశీలించారు. సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ ప్రవీణ్‌కుమార్, సంక్షేమాధికారిణి ఎస్.మణి తదితరులు పాల్గొన్నారు.

బత్తిలి పాఠశాల వజ్రోత్సవాలకు సన్నాహాలు

భామిని: మండలంలోని బత్తిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే విషయమై పాఠశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు అందిస్తే ఉత్సవాలు సాధ్యమవుతాయని హెచ్‌ఎం సన్యాసిరావు అన్నారు. 2026 జనవరి 16, 17, 18 తేదీల్లో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రాథమికంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పాఠశాల నిర్మించి 75 ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు.

వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచండి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కళాశాలల వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. ఇదే విషయమై వారు స్థానిక గురుకుల పాఠశాల(బాలికలు) సందర్శనకు మంగళవారం విచ్చేసిన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనారోగ్యం బారినపడిన విద్యార్థులపై సిబ్బంది, ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు తక్షణమే పరిహారం ఇప్పించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు ఇంటికుప్పల రామకృష్ణ, లోవరాజు, ఆరిక చంద్రశేఖర్, పల్ల సురేష్, దోని సురేష్ , బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలి



గురుకుల పాఠశాలలోని తాగునీటి బోరును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కురుపాం: స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతూ మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన..అక్కడి విద్యార్థుల కోసం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులు చనిపోయి వారం రోజులైనా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సందర్శించిన దాఖలాలు లేవన్నారు. పిల్లలను కోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఇవ్వాలని, అలాగే ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల కుటుంబాలకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: వన్యప్రాణులను సంరక్షించుకోవాలని, ఇది మనందరి బాధ్యతగా భావించాలని అటవీ శాఖ సిబ్బంది ప్రసాద్, రామారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు జరుగుతాయని, దీనిలో భాగంగా ప్రతి గ్రామానికి వెళ్లి వన్యప్రాణుల సంరక్షణ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



కాలువల్లోని పూడికలు తీయిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామంలో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు.. పారిశుధ్య సిబ్బందితో కాలువల్లోని పూడికలు తొలగించి, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేయించారు. గ్రామం పరిశుభ్రంగా ఉండేలా గ్రామస్తులు సహకరించాలని, తడి,పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్‌లకు అందివ్వాలని సర్పంచ్ ప్రజలను కోరారు.

హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



ఆశ కార్యకర్తలకు సూచనలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేయాలని పాలకొండ ఏరియా ఆస్పత్రి వైద్యురాలు మహేశ్వరి సూచించారు. మండలంలోని అన్నవరం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సూచనలు చేశారు. గ్రామీణులు, విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యంపై సమాచారం ఇవ్వాలన్నారు.

120 మందికి ఆరోగ్య తనిఖీలు



శిబిరంలో వైద్య తనిఖీలు చేస్తున్న వైద్యుడు శ్రీరామ్మూర్తి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని సచివాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హెల్పింగ్ హ్యాండ్స్, దోస్త్ మేరా దోస్త్, కింగ్స్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 120 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో భారీ వర్షం



కొత్తవీధిలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: మండల కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపిలేకుండా కాసేపు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ఉదయం ఎండ..సాయంత్రం వాన మాదిరిగా నెలకొన్న వాతావరణం నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాగే వాతావరణం కొనసాగితే వరి పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాశాల అధ్యాపకులు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలురు)లో సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్రం చేసిన జీఎస్టీ శ్లాబ్‌ల మార్పు, వాటి వల్ల ఏయే వస్తువుల కొనుగోళ్లపై ప్రయోజనం చేకూరనుందన్న విషయాలను ప్రిన్సిపాల్ పైల శంకరరావు తెలిపారు. అనంతరం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.గిరిబాబు, వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చట



జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి నుంచి లక్ష్మీపురం మీదుగా పరజపాడు గ్రామానికి కొత్తగా వేసిన బీటీ రోడ్డులో నాణ్యత లోపించిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి నిదర్శనంగా లక్ష్మీపురం సమీపంలో రోడ్డులో ఏర్పడిన ఓ పెద్దగుంతను చూపిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కారణంగానే రోడ్డు వేసిన కొన్నాళ్లకే మరమ్మతులకు గురైందని, ఇదంతా మూణ్నాళ్ల ముచ్చటేనని అంటున్నారు.

\-జియ్యమ్మవలస రూరల్

దారిద్ర్యం



పాలకొండ మండలంలోని గొట్టమంగళాపురం జంక్షన్ నుంచి చినమంగళాపురం మీదుగా యరకారాయపురం వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. దారి మొత్తం అడుగుకో గుంత.. గజానికో గొయ్యి మాదిరి కనిపిస్తోంది. ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే నరకం కనిపిస్తోందని, ఒళ్లు హూనమైపోతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి నాటికి అద్దాల్లా మెరిసే రోడ్లు వేసి చూపిస్తామన్నారు..ఏవీ అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే కొత్త రోడ్డు వేయాలని, కనీసం రోడ్డు మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.

\-పాలకొండ రూరల్

నిరసన



తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు మంగళవారం నిరసనకు దిగారు. కురుపాం మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలకు కనీస వేతనం కింద రూ.26 వేలు అందజేయాలని, పీహెచ్‌సీలకు వెళ్తున్న రోజులకు టీఏ, డీఏ ఇవ్వాలని, యూనిఫాం పంపిణీ చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశ కార్యకర్తలుగా గుర్తించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్, అమరావతిలలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం నాయకులు సరోజిని, దమయంతి, గౌరి, రవణమ్మ, అంజలి, కల్పన, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

\-కురుపాం